క్లుప్తంగా

ఆత్మీయ సన్మానం



పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పవిత్రను పలమనేరులోని ఆమె స్వగృహంలో గురువారం మండలానికి చెందిన పలువురు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు సన్మానించారు. విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆమె చెప్పారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె పంచాయతీలో గురువారం వాటర్‌షెడ్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించాయి. ఈశిబిరంలో పశువులను పరీక్షించడంతోపాటు తొంభై పశువులకు పిడుదల నివారణ మందు పిచికారీ చేసినట్లు పశువైద్యాధికారి మునిచంద్ర తెలిపారు. పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ తేజ, టీఏ షబ్బీర్‌బాషా, చైర్మన్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఈఎస్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

గుడుపల్లె: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పీఈఎస్ ఆసుపత్రిలో వారం పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, థైరాయిడ్ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేస్తామని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉన్న వారికి అన్ని ఉచితంగా చేస్తామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం: మండలంలోని కెంచనబళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.56 వేల విలువ చేసే కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని గ్రామస్తుడు సురేష్ బాబును అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు చెప్పారు.

రేపు మెగా జాబ్‌మేళా

కుప్పం: గుడుపల్లె రోడ్డులోని ఐఆర్ఎం విద్యా సంస్థలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు చెందిన ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. కళాశాల విద్యార్థులతో పాటు కుప్పం పరిసర ప్రాంతాల్లో డిగ్రీ, పీజీలు చేసిన విద్యార్థులు శనివారం 9 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

కొత్త రేషన్ కార్డులు పంపిణీ

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన పేదలందరికి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు కౌన్సిలర్ పూలత్యాగరాజు తెలిపారు. గురువారం 25వ వార్డు సచివాలయంలో వీఆర్‌వో ప్రసన్నతో కలసి లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు.

ఓవర్ బ్రిడ్జి నిర్మించరూ!

- రైల్వే డీఆర్ఎంకు వినతి

కుప్పం: కుప్పం రైల్వేస్టేషన్ వద్ద నూతనంగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని దక్షిణ, పశ్చిమ డివిజినల్ రైల్వే మేనేజర్ యోగేష్ మోహన్‌ను కోరినట్లు సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. గురువారం బెంగళూరులో డీఆర్ఎంను ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం ఇచ్చినట్టు చెప్పారు. రైల్వే గేటు మూసివేయడం వల్ల పాదచారులు, రైల్వే స్టేషన్ సమీపంలో మూడు ప్రభుత్వ కళాశాలలు ఉండటం వల్ల రెండు వేల మంది విద్యార్థులు రాకపోకకు ఇబ్బందులు పడుతున్నారని నివేదించినట్టు చెప్పారు. తన వినతిపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అలాగే కుప్పం నుంచి బెంగళూరుకు అదనంగా రెండవ పుష్‌పుల్ రైలు నడపాలని కోరినట్టు చెప్పారు.

ముందస్తు వేమన జయంతి



జ్ఞాపికలు, పుస్తకాలను చూపుతున్న పిల్లలు

గంగవరం: పలమనేరు పట్టణంలోని కళామందిరంలో గురువారం ముందస్తు వేమన జయంతి వేడుకలను నిర్వహించారు. వివిధ జిలాల నుంచి వచ్చిన పిల్లలు వేమల పద్యాలతో అలరించారు. 50మంది పిల్లలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పుస్తక బహుమతులను తెలుగు సాహిత్య సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు అందజేశారు. సంస్థ కార్యదర్శి పుష్ప, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, దేవకుమారి, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

- జయహో అంబేడ్కర్

విగ్రహావిష్కరణ చూసొద్దాం

- పెద్ద సంఖ్యలో విజయవాడకు బయల్దేరిన దళిత నేతలు
- ప్రత్యేక బస్సులకు జెండా ఊపిన ప్రజాప్రతినిధులు





పుంగనూరు: విజయవాడకు వెళ్లిన దళితనేతలు, చౌడేపల్లె నుంచి వెళ్తున్న దళిత నాయకులు

పుంగనూరు: విజయవాడలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో గురువారం మండలం నుంచి దళిత సంఘాల నేతలు, దళితులు బయల్దేరారు. తొలుత ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో దళిత నాయకులు చెన్నరాయుడు, రాజు, శంకరప్ప, కృష్ణప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చిత్రపటాలను ఊరేగింపు నిర్వహించి విజయవాడకు తరలివెళ్లారు. రాష్ట్రంలో దళితులకు అధిక ప్రాధాన్యత కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని దళిత నేతలు ప్రకటించారు.

చౌడేపల్లె నుంచి..

చౌడేపల్లె: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రామమూర్తి, జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అంబేడ్కర్ ఆశయాల సాధన దిశగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కట్టుబడి ఉన్నారని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ గోవిందు, బోయకొండ కమిటీ మాజీ డైరెక్టర్ శంకరప్ప, సర్పంచ్ కదిరప్ప, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, దళిత సంఘం నేతలు డిష్ సూరి, ఉత్తరాది హరిప్రసాద్, శ్రీనివాసులు ,ప్రసాద్‌బాబు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సదుం నుంచి..

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రత్యే బస్సుల్లో ఎంపీపీ ఎల్లప్ప ఆధ్వర్యంలో విజయవాడకు బయలుదేరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి షరీఫ్‌బాషా, వైఎస్సార్ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, శివారెడ్డి, సీతాపతి శ్రీనివాసులు, రామచంద్రయ్య, రమేష్, మాధవ, శ్రీరాములు, లక్ష్మయ్య, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల నుంచి..

రొంపిచెర్ల: మండలం నుంచి విజయవాడకు బయల్దేరిన ప్రత్యేక బస్సులను బస్సులను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బస్సుల్లోనే కాకుండా వివిధ వాహనాలలో కూడా పెద్దసంఖ్యలో దళితులు తరలి వెళ్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి మండలం నుంచి..

పెద్దపంజాణి: మండలానికి చెందిన పలువురు దళిత నేతలు సామాజిక, సమతా, సంకల్ప యాత్రలో భాగంగా విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం బస్సులో బయలుదేరారు. ఈ బస్సును ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, తహసీల్దార్ లోకేశ్వరరావు, సింగిల్ విండో డైరెక్టర్ క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







సదుం: విజయవాడకు బయలుదేరిన నాయకులు, రొంపిచెర్ల: జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, పెద్దపంజాణిలో..

782 గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు



గొర్రెలు, మేకల పెంపకందారులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీధర్

రొంపిచెర్ల: 782 గొర్రెలు, మేకలకు ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు మండల పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. గురువారం గానుగచింత గ్రామ పంచాయతీ మద్దిపట్లవారిపల్లెలో వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో మూగజీవాలకు ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణకు మందులు ఇచ్చి టీకాలు వేశారు. మూగజీవాలకు అంటు వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను శ్రీధర్ తెలియజేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ చంద్రయ్య నాయుడు, ఎంపీటీసీ రమణమ్మ, సర్పంచ్ హేమలత, వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి తేజశ్విని, టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డిశేఖర్, పశు వైద్య సిబ్బంది మోహిత్, అల్తాఫ్, నందకుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



రామకుప్పం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె/రామకుప్పం: మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్ ఆర్థిక సాయం చేశారు. గుడుపల్లె మండలం బోయనపల్లెకు చెందిన వెంకటమ్మ, అలాగే రామకుప్పం మండలం బల్లకు చెందిన మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్ షరీఫ్ మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్ గురువారం వెంకటమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఖాదర్ షరీఫ్ కుటుంబానికి సాయం చేశారు. మృతుల కుటుంబాలకు పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరనాథ్, చెన్న రాయన్, నారాయణస్వామి, వెంకటస్వామి, సంపంగి, రామకుప్పం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, రెస్కో డైరెక్టర్ థామస్, సర్పంచ్ విజయ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి



మహిళలతో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ

రామకుప్పం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. గురువారం ఉన్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరులో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు సారె అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు హంద్రీ–నీవా కాలువను పూర్తి చేసి రైతన్నలకు కృష్ణా జలాలను అందించి,నియోజకవర్గ ప్రజల కలను సాకారం చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కుప్పం ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత, స్థానిక సర్పంచ్ నేత్రావతి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి





రొంపిచెర్ల: ప్రసంగిస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, గుడుపల్లె: మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

రొంపిచెర్ల: గ్రామాభివృద్ధిలో సర్పంచులు, కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచులు, కార్యదర్శులకు గ్రామాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, సరైన ప్రణాళికల రూపకల్పనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఈ దిశగా పంచాయతీలు ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను సక్రమంగా ఖర్చు చేసి నివేదికలను తయారు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు ఇబ్రహీంఖాన్, ప్రసాద్ నాయుడు, అన్సర్‌బాషా, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానికి శ్రీ శక్తి భవనంలో 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులను ఎంపిక చేసుకోవాలని, గ్రామ స్థాయిలో పర్యటించి ప్రణాళికలు తయారు చేసుకుని నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఈఓపీఆర్డి శంకర్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై సమీక్ష



చర్చిస్తున్న కౌన్సిల్ సభ్యులు, మతపెద్దలు, వార్డు వలంటీర్లు తదితరులు

గంగవరం: కులగణన సర్వేకు సంబంధించి పలమనేరు పట్టణ వార్డు సచివాలయాల్లో మతపెద్దలు, కుల పెద్దలతో గురువారం రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. 19న శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వేకు షెడ్యూలు ఇచ్చిన నేపథ్యంలో వార్డు స్థాయిలో కౌన్సిల్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మతపెద్దలు, వార్డు వలంటీర్లతో సమావేశమై కులగణనపై చర్చించారు. ఈ సర్వేకు పురపాలక పట్టణ ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ కోరారు. ఇదివరకే ఏర్పాటు చేసిన సమావేశాల్లో చర్చించిన వివరాల సమాచారాన్ని సర్వే సిబ్బందికి అందజేయాలన్నారు.

బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

రొంపిచెర్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలోని గానుగచింతలో చోటుచేసుకుంది. వివరాలు..ఎర్రావారిపాళ్యం మండలం యల్లమంద తోటివారిపల్లెకు చెందిన జె.రమణ ద్విచక్రవాహనంలో రొంపిచెర్లకు వస్తుండగా.. రొంపిచెర్ల నుంచి గానుగచింతకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జగడంవారిపల్లె సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో రొంపిచెర్లకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నామమాత్రపు అద్దెతో సెప్టిక్ ట్యాంకులు శుభ్రం



మురుగునీటి నిల్వలను తొలగిస్తున్న ట్యాంకర్లను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మున్సిపల్ కార్మికులతో సెప్టిక్ ట్యాంకులను నామమాత్రపు అద్దెకు శుభ్రం చేసి, మురుగునీటిని బయట ప్రాంతాలకు తరలిస్తామని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో మురుగునీటి కాలువల్లో నీటి నిల్వలను సెప్టిక్ ట్యాంకులలో తీసుకెళ్లే కార్యక్రమాన్ని కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. సుమారు కోటి రూపాయలతో మున్సిపాలిటీకి మూడు సెప్టిక్ ట్యాంకర్లను కొనుగోలు చేశామని గుర్తుచేశారు.మూడు ట్యాంకర్లకు ముగ్గురు డ్రైవర్లు విజయ్‌కుమార్ -8074152690, సి.నాగరాజ -9963976521, టి.రెడ్డిశేఖర్-9177062164 లను, సిబ్బందిని నియమించామన్నారు. పట్టణ ప్రజలు వారి నంబర్లకు ఫోన్ చేసి సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ప్రజలు పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌కు సహకరించాలని ఆయన కోరారు.

వాల్మీకి సంఘం పోస్టర్ల ఆవిష్కరణ

పుంగనూరు: మండలంలోని నేతిగుట్లపల్లెలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో గురువారం క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘ నాయకుడు సుకుమార్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేయండి

- రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం

పుంగనూరు: ప్రతి ప్రాంతంలోను, ప్రతి ఇంటా విద్యుత్‌ను ఆదా చేయడం అలవరచుకోవాలని రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం కోరారు. గురువారం మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగం–పొదుపుపై రెండు రోజులు అవగాహన సదస్సు నిర్వహించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ, విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రస్తుతం సౌర విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో వీధి దీపాలు, బోర్లలో విద్యుత్ వినియోగం ఎక్కువైందని, ట్యాంకులు నిండినా మోటార్లు ఆపకపోవడం, విద్యుత్ దీపాలు పగలు కూడా ఆఫ్ చేయకపోవడం వల్ల విద్యుత్ దుబారా అవుతోందని విశ్లేషించారు. దీనివల్ల ప్రభుత్వ సంస్థలకు అధిక భారం పడుతోందన్నారు. ఈ దుబారాపై దృష్టి సారించి నియంత్రిస్తే విద్యుత్ ఎంతో ఆదా అవుతుందన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు వెంకట్రమణ, డీఈఈలు శ్రీనివాసులు, మహేష్, ఏఈ కృష్ణకుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను ఆసక్తిగా పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ దంపతులు

గంగవరం: పలమనేరు పట్టణంలోని గంగమ్మ దేవాలయ ప్రాంగణంలో గురువారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆలయ చైర్మన్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు మహిళలు ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై ముగ్గులను పరిశీలించి, విజేతలను ఎంపిక చేసి, బహుమతులు ప్రదానం చేశారు. విజేతలకే కాకుండా పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, ఆసుపత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

వి.కోట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గురువారం మండలంలోని తోటకనుమలో శ్రీశ్రీశ్రీ పట్టాలమ్మ, చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ తన సతీమణి పావనితో కలసి భూమిపూజ చేశారు. చండీహోమం, గణపతిపూజ, వివిధ హోమాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని, వేదపండితులకు పాదపూజ, గోపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహంతో ఈ ప్రాంత ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా కనుమ సంబరాలు



బరిలో దూసుకెళ్తున్న ఎద్దు

రామకుప్పం: కనుమ పండుగ వేడుకలను గురువారం రామకుప్పంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో ఉదయం దిగువ వీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం రెడ్డి వీధి నుంచి రైతులు దేవర ఎద్దులను డప్పుల హోరు, బాణసంచా మోత నడుమ ఊరేగించారు. ఆలయం ముందు దేవర ఎద్దులకు పూజల అనంతరం బరిలో పరుగులు తీయించారు. అనంతరం పరిసర గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను పరుగులు తీయించారు. వాటిని నిలువరించడానికి యువకులు పోటీ పడ్డారు. దీనిని తిలకించేందుకు వచ్చిన వేలాది జనంతో దిగువ వీధి కిక్కిరిసింది. స్థానిక సర్పంచ్ మురళీకృష్ణను నిర్వాహకులు సన్మానించారు.

కొండామర్రిలో 'వికసిత్ భారత్'



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజలు

చౌడేపల్లె: మండలంలోని కొండామర్రి, వెంగళపల్లె పంచాయతీలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఈఓపీఆర్డి కృష్ణవేణి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాల గురించి వీడియోలతో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ పథకాల ఫలాలు గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన లబ్ధిదారులను అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ, మహిళా–శిశు సంక్షేమ శాఖ, జల జీవన్ మిషన్, రెవెన్యూ శాఖల పథకాలు, సేవలపై ప్రజలకు ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు జయసుధమ్మ, నాగరత్న, బీజేపీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లిక, నియోజకవర్గ కన్వీనర్ మదన మోహన్ బాబు, రాజంపేట ఎంపీ సెగ్మెంట్ కన్వీనర్ నాన బాల కుమార్, పంచాయతీ కార్యదర్శి సుకుమార్‌రెడ్డి, ఏఓ జ్యోతమ్మ, ఉపాధి హామీ జేఈ ధనుంజయుడు, వీఆర్వో అశోక్ రెడ్డి, టీఏ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత మునిపల్లె



మునిపల్లె జట్టు క్రీడాకారులు

బైరెడ్డిపల్లె: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి మండల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మునిపల్లె జట్టు విజేతగా నిలిచిందని ఎంపీడీఓ రాజేంద్రబాలాజి తెలిపారు. మండల స్థాయి పోటీల్లో 13 జట్లు తలపడ్డాయని, ఫైనల్స్‌లో మునిపల్లె జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైందన్నారు.

కబడ్డీ విజేత పత్రపల్లె



విన్నర్స్ జట్టును అభినందిస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని ఎంపీపీ యువరాజు అన్నారు. గురువారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల కబడ్డీ ఫైనల్స్‌ను ఆయన తిలకించారు. మండల స్థాయి పోటీలకు 25 జట్లు హాజరయ్యాయి. ఫైనల్స్‌లో చింతమాకులపల్లె జట్టుపై పత్రపల్లె జట్టు విజయం సాధించింది. విన్నర్స్, రన్నర్స్ జట్లను ఎంపీపీ అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.